సగం రోడ్డుతోనే సరిపెడతారా..

- పార్సిగుట్ట మార్గంలో రోడ్డు నిర్మాణంపై అభ్యంతరం వ్యక్తం చేస్తున్న స్థానికులు

ముషీరాబాద్, జూన్ 9: రాంనగర్-పార్సిగుట్ట మార్గంలో పూర్తిస్థాయిలో రోడ్డు నిర్మాణ పనులు చేపట్టకపోవడంతో స్థానికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. భవన నిర్మాణదారులు రోడ్డు సెట్ బ్యాక్‌లో భాగంగా వదిలిపెట్టిన స్థలాలను కలుపుతూ రోడ్డు నిర్మాణం చేపట్టాల్సి ఉన్నా పాత రోడ్డు ఉన్నంత వరకు రోడ్డు వేసి చేతులు దులుపుకునే ప్రయత్నం చేస్తున్నారు. దీంతో పార్సిగుట్ట మార్గంలో కొత్త రోడ్డు వేసినా ఇరుకు మార్గంలో వాహనదారుల ఇక్కట్లు తప్పేలా లేవు. వాస్తవానికి రోడ్డు విస్తరణ ప్రతిపాదనలు ఉన్నా అధికారులు అవేమి పట్టించుకోకుండా రోడ్డు నిర్మాణ పనులు చేపడుతున్నారు. ఇటీవల పార్సిగుట్ట మార్గంలో రోడ్డు నిర్మాణ పనులు మొదలు పెట్టిన అధికారులు తొలి దశలో బ్రహ్మంగారి టెంపుల్ కమాన్ వరకు రోడ్డును నిర్మించారు. రెండవ దశ రోడ్డు నిర్మాణంలో భాగంగా బ్రహ్మంగారి కమాన్ నుంచి బాలాజీ స్వీట్ షాపు వరకు రోడ్డు నిర్మించే పనులు వారం రోజులుగా చేపడుతున్నారు. రాంనగర్ ప్రధాన రోడ్డు నుంచి కొంత దూరం వరకు భవన నిర్మాణదారులే స్థలాలు వదిలినా అధికారులు రోడ్డు వేయడానికి వెనకాడుతున్నారు. రోడ్డు నిర్మాణంలో భాగంగా తవ్వకాలు చేపట్టిన అధికారులు పాత రోడ్డు ఎంత వరకు ఉందో అంతే తవ్వి రోడ్డు నిర్మించడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటి పలువురు నిర్మాణ దారులు వదిలిన స్థలాలను తిరిగి అక్రమించుకోవడం, పుట్‌పాత్‌లపై నిర్మాణాలు చేపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పూర్తి స్థాయిలో రోడ్డు నిర్మాణం చేపట్టాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.

పార్సిగుట్ట మార్గంలో మధ్యలో తవ్వి వదిలేసిన రోడ్డు

టౌన్‌ప్లానింగ్ అధికారులు సహకరిస్తే రోడ్డు వేస్తాం..

టౌన్ ప్లానింగ్ అధికారులు పుట్‌పాత్‌లపై ఉన్న నిర్మాణాలు, సెట్ బ్యాక్ వదిలిన స్థలాలను సేకరించి ఇస్తే రోడ్డు నిర్మాణం చేపడతాం. వారు సహకరిస్తే పూర్తి స్థాయిలో రోడ్డు నిర్మిస్తాం.

-మురళి, ఏఈ సర్కిల్-15

ఖాదర్‌బాగ్ అభివృద్ధికి కృషి

కార్వాన్ నియోజకవర్గం అభివృద్ధికి కృషి చేస్తామని ఎమ్మెల్యే కౌసర్ మొహినుద్దీన్ అన్నారు. ఆదివారం ఖాదర్ బాగ్‌కు చెందిన ఎంఐఎం ప్రెసిడెంట్ మహ్మద్ షబ్బీర్‌ఖాన్ నేతృత్వంలో స్థానికులు ఎమ్మెల్యేను కలిసి పలు సమస్యలపై ఫిర్యాదు చేశారు. దీనికి స్పందించిన ఎమ్మెల్యే వర్షా కాలంలో ఇబ్బందులు లేకుండా ప్రజలకు డ్రైనేజీ, సీవరేజీ పైప్‌లైన్ల నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యుడు, నానల్‌నగర్ కార్పొరేటర్ ఎండీ నసీరుద్దీన్, ఎంఐఎం నాయకులు మహ్మద్ హరూన్‌ఫర్హాన్, షబ్బీర్ ఖాన్, షకీల్, జహంగీర్, రఫత్ తదితరులు పాల్గొన్నారు.

– మెహిదీపట్నం, జూన్ 9

వైద్య పరీక్షలు.. మందులు పంపిణీ

కవాడిగూడ, జూన్ 9: సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ముషీరాబాద్ కేర్ దవాఖాన వైద్యులు డాక్టర్ ఇమ్రాన్ ఖాన్, డాక్టర్ మెహినోద్దీన్ అన్నారు. ఈ మేరకు ఆదివారం భోలక్‌పూర్‌లోని అంజుమన్ ఫంక్షన్ హాల్‌లో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో 300 మంది పేదలకు బీపీ, షుగర్, ఈసీజీ, బోన్ మినరల్ డెన్సిటీ(బీఎండీ), పుల్‌మోనరీ ఫంక్షన్ టెస్ట్(పీఎఫ్‌టీ), గుండె, ఆర్థోపెడిక్, స్త్రీల సమస్యలపై పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కేర్ ముషీరాబాద్ వైద్యులు గైనకాలజిస్ట్ డాక్టర్ తస్నీమ్, ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ రవీ చంద్ర, కార్డియాలజిస్ట్ డాక్టర్ సుజిత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కులవృత్తుల సంఘం అధ్యక్షుడిగా సాయిబాబాచారి

గోల్కొండ బోనాల కులవృత్తుల సంఘం అధ్యక్షుడిగా ఎన్నికైన సాయిబాబాచారిని సన్మానిస్తున్న సిరుగుమల్లె రాజువస్తాద్, ఏసీపీ సయ్యద్ ఫయాజ్, ఇన్‌స్పెక్టర్ సైదులు

మెహిదీపట్నం, జూన్ 9: గోల్కొండ కోట జగదాంబిక ఎల్లమ్మ ఆలయం ఆషాఢ మాస బోనాల కులవృత్తుల సంఘం అధ్యక్షుడిగా బి.సాయిబాబా చారిని కొనసాగించడానికి సంఘం సభ్యులందరూ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. ఈ మేరకు ఆదివారం గోల్కొండ ఇబ్రహీంబాగ్‌లో గోల్కొండ జగదాంబిక ఎల్లమ్మ ఆలయ కమిటీ సలహాదారు, సిరుగుమల్లె రాజువస్తాద్ నేతృత్వంలో కులవృత్తుల సంఘం నాయకులు సమావేశం నిర్వహించారు. గత కొన్ని రోజులుగా కులవృత్తుల సంఘం అధ్యక్షుడి మార్పు కోసం ఎన్నికలు నిర్వహించడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి.ఈ నేపథ్యంలో సిరుగుమల్లె రాజువస్తాద్ అందరితో ఆదివారం చర్చించి ఈ సారి సాయిబాబా చారినే అధ్యక్షుడిగా కొనసాగించేలా అందరినీ ఒప్పించారు. అంతే కాకుండా ఆగస్టు 11న నూతన కమిటీ కోసం ఎన్నికలను నిర్వహించాలని నిర్ణయించారు. గోల్కొండ ఏసీపీ సయ్యద్ ఫయాజ్, ఇన్‌స్పెక్టర్ సైదులు, నాయకులు నర్సింగ్‌రావు, శివశంకర్,శ్రీకాంత్ చారి పాల్గొన్నారు.

బక్రీద్‌ను ప్రజలు ప్రశాంతంగా జరుపుకోవాలి

బక్రీద్‌ను ప్రజ లు ప్రశాంతంగా జరుపుకోవాలని గోల్కొండ ఇన్‌స్పెక్టర్ సైదులు అన్నారు. బక్రీద్ సందర్భంగా ఉద్రిక్తతలు లేకుండా అందరూ సం యమనం పాటించాలని ఆయన అన్నారు. గోల్కొండ పోలీస్ స్టేషన్‌లో మైత్రి, పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ సైదులు మాట్లాడుతూ.. బక్రీద్ సందర్భంగా అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ప్రజలు పోలీసులకు సహకరించాలని తెలిపారు. గోల్కొండ ప్రాంతం మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తుందని దీనిని అందరూ కాపాడటానికి కృషి చేయాలని అన్నారు. ఈ సమావేశంలో మైత్రి, పీస్ కమిటీ అధ్యక్షుడు సిరుగుమల్లె రాజువస్తాద్, నాయకులు జైనుల్లాబెదిన్ ఆబేద్, పరమానందం పాల్గొన్నారు.

– మెహిదీపట్నం, జూన్ 9

కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి శుభాకాంక్షలు

అంబర్‌పేట, జూన్ 9 : కేంద్ర మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన సికింద్రాబాద్ ఎంపీ జి.కిషన్‌రెడ్డికి అంబర్‌పేట నియోజకవర్గం బీజేపీ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డా.ఎన్.గౌతంరావు, నల్లకుంట మాజీ కార్పొరేటర్ వనం రమేశ్ ఢిల్లీలో ఆయనను కలిసి పూలబొకే ఇచ్చి అభినందనలు తెలిపారు.

కేంద్రమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన కిషన్‌రెడ్డికి అభినందనలు తెలియజేస్తున్న డా.ఎన్.గౌతంరావు,తదితరులు

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలియజేస్తున్న మాజీ కార్పొరేటర్ వనం రమేశ్ తదితరులు

ప్రధాని నరేంద్రమోదీకి క్షీరాభిషేకం

ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేసిన శ్రీనివాస్‌ముదిరాజ్ తదితరులు

అంబర్‌పేట, జూన్ 9 : ఎన్డీయే కూటమి హ్యాట్రిక్ ప్రధాన మంత్రిగా మోదీ ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా గోల్నాక డివిజన్ జైస్వాల్‌గార్డెన్ కాలనీలో సీనియర్ బీజేపీ నాయకులు సి.శ్రీనివాస్‌ముదిరాజ్ ఆధ్వర్యంలో నరేంద్రమోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అంబర్‌పేట అసెంబ్లీ ఓబీసీ మోర్చా జాయింట్ కన్వీనర్ అనిల్‌చారి, రామస్వామి, లక్ష్మీకాంత్‌గౌడ్, దిలీప్‌శర్మ, రమేశ్‌గౌడ్, దేవేందర్, వెంకటరమణ, తిరుపతి, విజయ్, విష్ణువర్ధన్ పాల్గొన్నారు.

బీజేపీ కార్యాలయం ఎదుట సంబురాలు

ప్రధాని నరేంద్రమోదీ మూడవ సారి ప్రధానిగా ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా నాంపల్లిలోని రాష్ట్ర బీజేపీ కార్యాలయం ఎదుట సంబురాలు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే ప్రేమ్‌సింగ్‌రాథోడ్, ఉమా శంకర్, డి. గోపాల్ జీ, దాసరి శేఖర్, సుధాకర్‌రెడ్డి పార్టీ కార్యాలయం వద్ద మిఠాయిలు తినిపించుకొని సంబురాలు జరుపుకున్నారు.

– అబిడ్స్, జూన్ 9

పెరిక వివాహ పరిచయ వేదికకు స్పందన

పెరిక కుల 25వ ఉచిత వధూవరుల వివాహ పరిచయ వేదికను ఆదివారం బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించారు. వేదిక కన్వీనర్ సుంకరి ఆనంద్ పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా రాష్ట్ర పెరిక కుల సంఘం అధ్యక్షుడు మద్దా లింగాయ్య, గ్రేటర్ హైదరాబాద్ పెరిక కుల సంఘం అధ్యక్షుడు బత్తిని పరమేశ్ హాజరై ప్రారంభించారు. వేదిక కన్వీనర్ మాట్లాడుతూ.. 300 మందికి పైగా పరిచయ వేదికను సద్వినియోగం చేసుకున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భూసాని శ్రీనివాస్, ఎ. శ్రీనివాస్, మనోహర్, విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

– చిక్కడపల్లి, జూన్ 9

శ్రీ రేణుక ఎల్లమ్మ 11వ వార్షికోత్సవం

అంబర్‌పేట డివిజన్ ప్రేంనగర్‌లో శ్రీ రేణుక ఎల్లమ్మ 11వ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. ఈ వార్షికోత్సవాల్లో బాగ్‌అంబర్‌పేట డివిజన్ మాజీ కార్పొరేటర్ కె. పద్మావతిడీపీరెడ్డి పాల్గొని అమ్మవారికి పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు వారిని శాలువాతో సత్కరించారు.

– అంబర్‌పేట, జూన్ 9

ఎంపీ అసదుద్దీన్ ఒవైసీకి సన్మానం

పార్లమెంట్ ఎన్నికలలో హైదరాబాద్ లోక్‌సభ ఎంపీగా ఐదో సారి ఎన్నికైన ఎంఐఎం పార్టీ అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీని కార్వాన్ నియోజకవర్గం ఎంఐఎం పార్టీ సీనియర్ మహిళా నాయకురాలు సన్మానించారు.

– మెహిదీపట్నం, జూన్ 9

రామోజీరావు మృతిపై సంతాపం

అక్షర యోధుడు, రామోజీరావు మృతి పట్ల టీడీపీ జాతీయ ప్రచార కార్యదర్శి జె. దశరథ్ తన సంతాపాన్ని వ్యక్తం చేశారు. బాగ్‌అంబర్‌పేటలో ఆదివారం రామోజీరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పత్రికా రంగానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు.

– అంబర్‌పేట, జూన్ 9

నేషనల్ మార్ట్ ఇండియా కా హైపర్ మార్ట్ ప్రారంభం



నాంపల్లి నియోజకవర్గం, మెహిదీపట్నం డివిజన్‌లోని ఆర్టీసీ డిపో పక్కన నూతనంగా ఏర్పాటు చేసిన నేషనల్ మార్ట్ ఇండియా కా హైపర్ ఏడో శాఖను ఎంఐఎం పార్టీ అధ్యక్షుడు, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ, ఇండియా మార్ట్ వ్యవస్థాపకుడు యశ్‌అగర్వాల్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ..వినియోగదారులకు ఉత్తమమైన సేవలను, నాణ్యమైన సరుకులను అందించాలని అన్నారు.

– మెహిదీపట్నం

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల అందచేత

ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందించడానికి కృషి చేస్తామని నాంపల్లి ఎమ్మెల్యే మహ్మద్ మాజీద్ హుస్సేన్ అన్నారు. ఆదివారం నాంపల్లి నియోజకవర్గానికి చెందిన 21 మంది లబ్ధిదారులకు మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ రూ.7,34,000 విలువ చేసే చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు.

– మెహిదీపట్నం, జూన్ 9

జర్నలిస్ట్ రత్నాకర్ శర్మ సేవలు చిరస్మరణీయం

చిక్కడపల్లి, జూన్ 9 : జర్నలిస్ట్ రత్నాకర్‌శర్మ సేవలు చిరస్మరణీయమని పలువురు వక్తలు అన్నారు. సచ్చిదానంద కళా పీఠం ఆధ్వర్యంలో ఆదివారం ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లోని సిటీ కల్చరల్ సెంటర్‌లో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన జర్నలిస్ట్ రత్నాకర్‌శర్మ సంతాప సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ ఎం.కె. రాము మాట్లాడుతూ.. రత్నాకర్‌శర్మ సచ్చినంద కళా పీఠం స్థాపించి ఎందరో బాల బాలికలను సంగీత నృత్య కళాకారులుగా సమాజానికి అందించారని అన్నారు. సాంస్కృతిక సంస్థల ప్రతినిధులు వెంకటేశ్, ప్రసాద్, సంగీత, హరిని, జర్నలిస్టులు కనకాచారి, సతీశ్, కృష్ణ, చిలుకూరి అఖిలేశ్, రామిరెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

12న ప్రొఫెసర్ కోదండరామ్‌కు పురస్కారం

రవీంద్రభారతి, జూన్ 9 : తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ, సీల్‌వెల్ కార్పొరేషన్, శృతిలయ ఫౌండేషన్, ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఈ నెల 12న రవీంద్రభారతిలో సీల్‌వెల్ సినీ సుస్వరాలు-57, తెలంగాణ దశాబ్ది వేడుకలు జరగనున్నాయి. ఈ సందర్భంగా ప్రొఫెసర్ డా. కోదండరామ్‌కు తెలంగాణ సాధికారిత విప్లవ యోధ-2024 పురస్కారాన్ని మంత్రి జూపల్లి కృష్ణారావు బహూకరించనున్నట్లు సీల్‌వెల్ కార్పొరేషన్ సీఎండీ సుబ్బారావు, గాయని ఆమని సంయుక్త ప్రకటనలో తెలిపారు.

విద్యార్థుల ఉన్నతికి ప్రతిభా పురస్కారాలు దోహదం : స్పీకర్ గడ్డం ప్రసాద్

పురస్కారాలు ప్రదానం చేసిన స్పీకర్ గడ్డం ప్రసాద్‌ను సత్కరిస్తున్న నిర్వాహకులు

తెలుగు యూనివర్సిటీ, జూన్ 9 : ప్రతిభా పురస్కారాలు విద్యార్థుల ఉన్నతికి దోహదపడుతాయని శాసన సభాపతి గడ్డం ప్రసాద్ అన్నారు. రాష్ట్ర వీరశైవ లింగాయత్ బలిజ సంఘం తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా 2023-24విద్యాసంవత్సరంలో పదవ తరగతి పరీక్షలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 200మంది వీరశైవ లింగాయత్ విద్యార్థులకు ఆదర్శనగర్‌లో గల బీఎం బిర్లా ఆడిటోరియంలో ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పెద్దపట్ల భరత్, కార్యదర్శి కడపల్ల సోమేశ్వర్ నిర్వహణలో జరిగిన ఈ కార్యక్రమంలో నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి పాల్గొని విద్యార్థులకు పురస్కారాలు అందజేశారు. వీరశైవలింగాయత్ లింగబలిజ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పి.సంగమేశ్వర్, కేంద్ర కమిటీ సభ్యులు మల్లికార్జున అప్ప, శెట్టి శివకుమార్, దినేశ్‌పాటిల్, శివశరణ్, రాచప్ప, డాక్టర్ శివప్ప, గాజుల శివకుమార్, మహిళా అధ్యక్షురాలు సూర్యశ్రావణి, కార్యదర్శి విద్యుల్లత, కోశాధికారి అశ్విని, శివకుమార్ పాల్గొన్నారు.

కళాకారులకు ఘన సత్కారం..

మహతి అకాడమీ, తెలంగాణ కళాజాగృతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ పదో వార్షికోత్సవాలను తెలంగాణ సారస్వత పరిషత్ హాల్‌లో ఆదివారం నిర్వహించారు. 'సాంస్కృతిక సంబురాల సరాగాలు' శీర్షికన నిర్వహించిన ఈ కార్యక్రమంలో సాహితీవేత్తలు డాక్టర్ ఎం.కె రాము, సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి, దర్శకుడు రేలంగి నరసింహారావు, నృత్య గురువు డాక్టర్ భారతి కళాకారులను సత్కరించారు.

– తెలుగు యూనివర్సిటీ

చిన్నారి కళాకారులకు పురస్కారాలు ప్రదానం

సంస్కృతి సర్వీసెస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ ఆడిటోరియంలో ఆదివారం సాయంత్రం సంస్కృతి కళారాధన శీర్షికన నిర్వహించిన కార్యక్రమంలో పలువురు కళాకారులకు కళాశ్రీ, వాద్యశ్రీ, సర్వశ్రీ, కళావిశారద బిరుదులతో పాటు ప్రశంసా పత్రాలను నటులు జెమినీ సురేశ్, వెంకట్ గిరధర్, నటీమణులు గీతాసింగ్, అనుపమ పాల్గొని అందజేసి వారి కళాత్మక ప్రతిభను ప్రశంసించారు.

– తెలుగు యూనివర్సిటీ

ప్రశాంతంగా గ్రూప్-1 పరీక్ష

- ఒక్క నిమిషం ఆలస్యంగా వచ్చిన అభ్యర్థులు
- బతిమాలినా లోపలికి అనుమతించని వైనం
- గేట్ వద్ద నిరసన తెలిపిన 9 మంది అభ్యర్థులు

పరీక్షా కేంద్రంలోకి వచ్చిన అభ్యర్థులను పరిశీలించి లోపలికి అనుమతిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ లక్ష్మణ్‌నాయక్

సుల్తాన్‌బజార్, జూన్ 9 : తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించిన గ్రూప్-1 పరీక్ష మూడంచెల భద్రత నడుమ ప్రశాంత వాతావరణంలో జరిగింది. ఒక్క నిమిషం ఆలస్యంగా వచ్చిన అభ్యర్థులు ఎంత బతిమాలినా పరీక్షా కేంద్రంలోకి పోలీసులు అనుమతించలేదు. ఆదివారం నిర్వహించిన గ్రూప్-1 పరీక్షను రాసేందుకు వివిధ జిల్లాల నుంచి అభ్యర్థులు నాలుగు నిమిషాలు ఆలస్యంగా నాంపల్లిలోని ఇందిరా ప్రియదర్శిని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలకు చేరుకున్నారు. కాగా పది గంటలలోపే పరీక్షా కేంద్రంలోని అనుమతి ఉండటంతో పోలీసులు, అధికారులు అభ్యర్థులు ఎంత బతిమాలినా కేంద్రంలోకి అనుమతించలేదు. దీంతో అభ్యర్థులు పరీక్షా కేంద్రం ముందు కొద్ది సేపు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అభ్యర్థులు మాట్లాడుతూ ఎంతో కష్టపడి చదువుకొని ఆశగా ఎదురు చూస్తున్న తమకు పరీక్షా కేంద్రంలోకి అనుమతించక పోవడం బాధా కరమని అన్నారు. ఈ విషయమై బేగంబజార్ ఇన్ స్పెక్టర్ జి. విజయ్‌కుమార్ అభ్యర్థులను సముదాయించి పంపించి వేశారు. సుల్తాన్‌బజార్ పోలీస్‌స్టేషన్ పరిధిలో తెలంగాణ మహిళా విశ్వవిద్యాలయంలో రెండు కేంద్రాలలో 960 మంది అభ్యర్థుల పరీక్ష రాయాల్సి ఉండగా 600 మంది అభ్యర్థులు పరీక్ష రాయగా 360 మంది అభ్యరు లు గైర్హాజరు అయ్యారు. ప్రగతి మహా విద్యాలయంలో మొత్తంగా 384 మంది పరీక్ష రాయాల్సి ఉండగా 231 మంది పరీక్షకు హాజరు కాగా 153 మంది గై ర్హాజరయ్యారు. కాగా ఈ పరీక్షా కేంద్రానికి ఇద్దరు అభ్యర్థులు ఆలస్యంగా రావడంతో పోలీసులు అనుమతి నిరాకరించడంతో వెను దిరిగారు. అదేవిధంగా జాంబాగ్‌లోని వివేక్ వర్ధిని కళాశాలలోని కేంద్రంలో పరీక్షను ప్రశాంతంగా నిర్వహించారు. ఆయా పరీక్షా కేంద్రాలలో పరీక్షలు సజావుగా సాగేలా సుల్తాన్‌బజార్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసాచారి పర్యవేక్షించారు. మాసబ్‌ట్యాంక్‌లోని సైఫా బాద్ సైన్స్ కళాశాలలో మొత్తంగా 672 మంది లో 400 హాజరు కాగా, 272 మంది గైర్హాజరు అయ్యారని కళాశాల ప్రిన్సిపాల్ ప్రొ ఫెసర్ జే లక్ష్మణ్‌నాయక్ తెలిపారు. కాగా ఈ పరీక్షా కేంద్రానికి 10 గంటల 1 నిమిషానికి కేంద్రానికి వచ్చిన అభ్యర్థిని పోలీసులు, అధికారులు లోపలికి అనుమతించలేదు. ఆదివారం నిర్వహించిన గ్రూప్-1 పరీక్షకు మూడంచెల భద్రత కల్పించారు.

ఆటోలపైకి దూసుకెళ్లిన లారీ

మెహిదీపట్నం, జూన్ 9: హ్యాండ్ బ్రేక్ ఫెయిల్ కావడంతో ఓ లారీ పార్కింగ్ చేసిన వాహనాలపైకి దూసుకువెళ్లింది. ఈ ఘటన ఆసిఫ్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం వెలుగుచూసింది, అదృష్టవశాత్తు ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదని ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.... ఆసిఫ్ నగర్ జిగ్రా ప్రాంతంలో ఉన్న సిటీ డైమండ్ హోటల్ సమీపంలో ఓ లారీ డ్రైవర్ లారీని పార్కు చేసి హ్యాండ్ బ్రేక్‌వేసి వెళ్లాడు. హ్యాండ్ బ్రేక్ ఫెయిల్ కావడంతో పార్కింగ్ చేసిన స్విఫ్ట్ కారు, ఏసీ ఆటో ట్రాలీ, బైక్‌పైకి లారీ దూసుకు వెళ్లింది. దీంతో అవి ధ్వంసమయ్యాయి. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో ప్రాణాపాయం తప్పిందని పోలీసులు తెలిపారు. కేసు దర్యాప్తులో ఉంది.

వృద్ధుడు మృతి

కాచిగూడ, జూన్ 9 : వృద్ధుడు మృతి చెందిన ఘటన కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. గుర్తుతెలియని వృద్ధుడు(65)శివరాంపల్లి రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫాం చివర్లో కొంత కాలంగా అనారోగ్యంగా ఉంటూ శనివారం రాత్రి మృతి చెందాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని ఉస్మానియా దవాఖానకు తరలించారు. మృతుని ఒంటిపై ఆకుపచ్చ రంగు చొక్క, నలుపు రంగు ప్యాంట్ ధరించి, ఎత్తు 5.4 ఉన్నట్లు పేర్కొన్నారు. కేసును కాచిగూడ రైల్వే పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

హమాలీల రేట్ల పెంపు..

అబిడ్స్, జూన్ 9 : హమాలీల రేట్లను పదిహేను శాతానికి పెంచుతున్నట్లు భాగ్యనగర్ ట్రాన్స్‌పోర్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ లేఖను యూనియన్ నాయకులకు అందజేసింది. అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, ఉపాధ్యక్షుడు వెంకన్న, కార్యదర్శి సుబ్రహ్మణ్యం న్యూ ఉస్మాన్‌గంజ్ హమాలీ సంఘం అధ్యక్షుడు ఎస్ ధన్‌రాజ్, సంఘం జాతీయ నాయకుడు అలీబాక్రి, రామకృష్ణ, నసీర్, అంజయ్య, హబీబ్, కర్ణ లు లేఖను స్వీకరించి ఉస్మాన్‌గంజ్ హమాలీల రేట్లను పెంచడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ట్రాన్స్‌పోర్ట్ అసోసియేషన్ యజమానులు స్పందించి రేట్లను పెంచడంతో ఈ సందర్భంగా ధన్‌రాజ్ .. వారికి కృతజ్ఞతలు తెలిపారు.